# నీటిని పొదుపుగా వాడుకోవాలి

**గజ్వేల్ టౌన్, జూలై 3, ప్రభాతవార్త:**
ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే హెచ్ఎండబ్ల్యుఎస్ పైపులైన్ నుండి పాతూరు జంక్షన్ వద్ద కోమటిబండకు నీటి సరఫరా జరుగుతుందని, కొండపాక దగ్గరున్న పంపుహౌస్ నుంచి పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా కొండపాకలోని హెచ్ఎండబ్ల్యుఎస్‌కు సంబంధించిన పంపుసెట్ల సామర్థ్యం తగ్గడం వల్ల నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మిషన్ భగీరథ గజ్వేల్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ వి.శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. పంపుసెట్టు మరమ్మతు 15రోజుల వరకు కొనసాగుతున్నందున గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. నీరు రానిరోజు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బోరునీటిని ఉపయోగించి ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలని కోరారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కాంగ్రెస్‌కు బిగ్ షాక్
## రెండుమూడు రోజుల్లో బిజెపిలోకి భారీగా చేరికకు సన్నద్ధం

**గజ్వేల్, జూలై 3, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్ అని చెప్పవచ్చు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తన అనుచరులతో బిజెపిలోకి చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. గత రెండుమూడు రోజులనుండి బిజెపి అధిష్ఠానంతో గాడిపల్లి భాస్కర్ చర్చలునిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బిజెపినేత రాంచందర్‌రావుతోపాటు ఎంపి ఈటల రాజేందర్, ఎంపి రఘునందన్‌రావులతో గురువారం కలిసి బిజెపిలో చేరుతున్నట్లు వారికి సమాచారం అందించారు. మరో రెండుమూడు రోజుల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నుండి ఆయనతోపాటు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్‌పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పెద్దఎత్తున చేరనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్‌పార్టీ పుంజుకుంటున్న తరుణంలో గాడిపల్లి బిజెపిలో చేరికతో కాంగ్రెస్ మనుగడ కష్టమే అనుకుం టున్నారు. సీనియర్ నాయకులు బుజ్జగించినా ఫలించకపోవడంతో బిజెపిలోకి వెళ్లనున్నట్లు తెలిసింది.

# మీరు ఆశీర్వదించారు మేం అధికారంలోకి వచ్చాం

## -చేర్యాలలో భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**చేర్యాల, జూలై 3, ప్రభాతవార్త:**
మీరు ఆశీర్వదించారు మేం అధికారంలోకి వచ్చామని, ఇచ్చినమాట ప్రకారం పథకాలను అమలు చేస్తున్నామని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డితెలిపారు. గురువారం చేర్యాలపట్టణం లోని ఓఫంక్షన్‌హాల్‌లో చేర్యాల, మద్దూరు, కొమురవెళ్ళి, ధూళిమిట్ట మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులకు మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ హైమావతి, జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోకలిసి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పంపిణీచేశారు.అనంతరం ఎంపి మాట్లాడుతూ రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో ఉన్నా సిఎం రేవంత్‌రెడ్డి ఇంతపెద్ద పథకాన్ని పేద ప్రజల కోసం తీసుకొచ్చి అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం కాంగ్రెస్‌పార్టీ పథకాలన్నీ అమలుచేస్తుందని, ప్రజాపాలనలో పథకాలు మేము తీసుకొస్తాం దానిని అమలు చేయాల్సింది మాత్రం అధికారులని, తమకు అధికారులు టైం ఇవ్వకున్నా ప్రజలకు మాత్రం సమయం కేటాయించి పథకాలు, పనులు అయ్యే విధంగా చూడాలని కిందిస్థాయి అధికారులకు సూచించాలని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. పట్టణాలతోపాటు గ్రామాల్లో అసలైన లబ్దిదారులను గుర్తించి పథకాలు అందేవిధంగా చూడాలని పార్టీనాయకులకు, అధికారులకు తెలిపారు. నాలుగు మండలాలకు మొత్తం 590మంది లబ్దిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని కాని ఇప్పటికీ సుమారు రెండు వందల ఇళ్లే మొదలు పెట్టారని మిగతావారు ఎందుకు మొదలు పెట్టలేదో పూర్తి స్థాయిలో విచారణచేపట్టి అసలైన లబ్దిదారులకు అందేలా చూడాలని తెలిపారు. ఎవరు తొందరగా ఇళ్లు పూర్తిచేస్తారో వారి ఇంటికొస్తా. ఖర్చు మొత్తం నేనే భరిస్తా. జిల్లా కలెక్టర్‌తోపాటు నేను వచ్చి భోజనంచేస్తానని లబ్దిదారులకు తెలిపారు.

**పదేళ్ళలో ఖజానాను దోచుకుని విదేశాలకు పంపించుకున్నారు...**
**-డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**
బిఆర్ఎస్ పదేళ్ళు అధికారంలో ఉండి ఖజానాను దోచుకుని విదేశాల్లో దాచుకుని రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల్లోకి తోసేసారని జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదన్నారు. చేర్యాలపట్టణంలో ఎక్కడ డబుల్ బెడ్ రూంలు ఇచ్చారో బిఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని డిమాండ్‌చేశారు. బిఆర్ఎస్ దొరల పాలనలో అన్నీ అక్రమాలు, అవినీతే జరిగిందన్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్‌లో కోటి రూపాయల నిధులు హరీష్‌రావు తీసుకెళ్ళడంతో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకివచ్చిన తర్వాత ఆలెక్కలనుతేల్చడంతో తిరిగి ఇస్తామంటున్నారన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎంపి చామల

**ఎంపికి వినతిపత్రం అందించిన జెఎసి నాయకులు..**
చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని జెఎసి నాయకులు కార్యక్రమం నడుస్తున్నప్పుడు మధ్యలోకి వచ్చి వినతిపత్రం అందించడంతో అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కార్యక్రమం నడుస్తున్న క్రమంలో ఏ ఇతర అంశాలకు సంబంధించి మధ్యలోకి వచ్చి చెప్పకూడదన్నారు. దీంతో ఎంపి సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ ఈ విషయాన్ని రెవెన్యూమంత్రి దృష్టికితీసుకెళ్ళి త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డివో సదానందం,చేర్యాల ఎమ్మార్వో దిలీప్‌కుమార్ నాయక్, ఎంపిడివో మహబూబ్ అలీ, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, కాంగ్రెస్‌పార్టీ మాజీజెడ్పిటిసి గిరికొండల్‌రెడ్డి,పూర్మ ఆగంరెడ్డి,కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్,దాసరి కళావతి,కాత శ్రీనివాస్, అందె నానిబాబు,మల్లిగారి నర్సింహులు నాలుగు మండలాలనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికఫీజులు వసూళ్లుచేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దుచేయాలి

**-డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివరాజ్**



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శివరాజ్

**హుస్నాబాద్ రూరల్, జూలై 3, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ పట్టణంతో పాటు జిల్లావ్యాప్తంగా విద్యార్థులనుండి అధికఫీజులు వసూళ్ల చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దుచేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుగులోతు శివరాజ్ డిమాండ్‌చేశారు. గురువారం హుస్నాబాద్‌లో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశానికి హాజరైన కలెక్టర్ హైమావతిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ప్రయివేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ గురించి వారికి వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాలతోపాటు యూనిఫాం, టై, బెల్ట్‌లు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై వెంటనే తనిఖీలు చేపట్టి వాటి అనుమతులు రద్దుచేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని కోరారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలి

**-హైదరాబాద్ ధర్నా చౌక్‌కు తరలివెళ్లిన ఉద్యోగులు**



ధర్నాలో పాల్గొన్న జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

**సిద్దిపేట అర్బన్, జూలై 3, ప్రభాతవార్త:**
తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ధర్నా చౌక్ వేదికగా గురువారం నిర్వహించిన రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనకు సిద్దిపేట జిల్లాకు చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలివెళ్లారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగాల నుంచి తొలిగించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తిరిగి తీసుకోవాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌కు తరలివెళ్లినవారిలో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ జెఎసి చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు పొన్నమల్ల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజమల్లు, కోశాధికారి చెట్లపల్లి రాజేష్, డివిజన్ అధ్యక్షులు పోతుల నర్సింలు, సభ్యులు గుండాల సాయిబాబా, కైరంకొండ భిక్షపతి తదితరులు ఉన్నారు.

# నమ్మించి మోసం చేశారు...!

**-ఇదేంటని ప్రశ్నిస్తే దాడిచేసి బెదిరిస్తున్నారు**

**అక్కన్నపేట, జూలై 3, ప్రభాతవార్త:**
ఉన్న కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవించే గిరిజనరైతును ఒక ఫర్టిలైజర్ నిర్వాహకుడు నమ్మిచ్చి నకిలీవిత్తనాలు విక్రయించడంతోపాటు, పంటదిగుబడి తక్కువవచ్చిందని ప్రశ్నించినందుకు తనపై దాడిచేసిన సంఘటన మండలంలోని గుబ్బడిగ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, మండలంలోని కేశనాయక్‌తండాకు చెందిన గుగులోతు శ్రీనివాస్ అనే రైతు గుబ్బడిగ్రామంలోని శివసాయి ఫర్టిలైజర్‌లో యాటపోలు సంపత్ వద్ద గత రెండేళ్లుగా విత్తనాలతోపాటు ఎరువులు కొనుగోలు చేసేవాడని, అయితే గడిచిన యాసంగిలో ఫర్టిలైజర్ దుకాణంలోకి నూతనంగా వరివిత్తనాలు వచ్చాయని ఆవిత్తనాలు సాగుచేస్తే ఎకరాకు 40 క్వింటాళ్ల ధాన్యం వస్తుందని పండించిన పంటను సైతం తానే రూ.2800లకు క్వింటాలు కొనుగోలు చేస్తామని రైతు శ్రీనివాస్‌ను సంపత్ నమ్మించి విక్రయించారని, తీరా వరిసాగుచేసిన రైతుకు ఎకరాకు కనీసం 10క్వింటాళ్ల ధాన్యం రాకపోగా, కంగుతిన్న శ్రీనివాస్ షాపుకు వెళ్లి ఇదేంటని ప్రశ్నిచగా షాపు నిర్వాహకులు ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నారని, కనీసం ఉన్న ధాన్యాన్ని అయినా కొనుగోలు చేయమంటే రూ.2300ల కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయమంటున్నారని వాపోయారు. ఈవిషయంలో తనను ఎందుకు మోసంచేశావని షాపు నిర్వాహకులను నిలదీయగా షాపు నిర్వాహకుడితోపాటు వారి సోదరులు తనపై గురువారం దాడికి దిగి ఇష్టంవచ్చినట్లు కొట్టారని, ఈవిషయంలో తనకు న్యాయంచేయాలని కోరుతూ రైతు శ్రీనివాస్ అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

# అనుమతులు లేకుండా కుంటశిఖం నుండి రోడ్డు ఏర్పాటు

**-చోద్యం చూస్తున్న అధికారులు**



కుంటశిఖం నుండి అనుమతి లేకుండా వేసిన రోడ్డు

**హత్నూర, జులై 3, ప్రభాతవార్త:**
హత్నూర మండలం కోడిపాక గ్రామం పరిధిలోని హనుమాన్ కుంటశిఖంను ఆక్రమించి రోడ్డును వేసుకున్నారని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. కుంటశిఖంలో నుండి, వ్యవసాయపొలానికి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు వేసుకున్నారని స్థానికులు ఆరోపించారు. వేరేచోటు నుంచి మట్టి తీసుకువచ్చి కుంటశిఖంలో నుండి కొత్తగా రోడ్డును ఏర్పాటు చేశారని వారు తెలిపారు. అనుమతులు లేకుండా వేసిన రోడ్డు వల్ల కుంటలకు నీళ్లు వచ్చే మార్గం కూడా తగ్గిపోతుందని, పశువులను మేపడానికి తీసుకువెళ్లేందుకు కూడా ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు పలువురు తెలిపారు. సంబంధిత అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పలువులు కోరుతున్నారు. ఈవిషయమై నీటి పారుదలశాఖ ఎఈ వందనను వివరణ కోరగా కోడిప్యాక్ హనుమాన్‌కుంట నుండి రోడ్డు వేయడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, విచారణజరిపి శాఖాపరమైన చర్య తీసుకుంటామని ఎఇ వందన తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అనుమానాస్పద మృతి

**నాగల్‌గిద్ద, జులై 3, ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని గంగారాంతాండాలో బుధవారంరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఎనక్‌పల్లి పత్తునాయక్‌తాండాకుచెందిన రాథోడ్‌మారుతి (40), గంగారాం తాండాకు చెందిన చౌహాన్ మారుతి(50)లు ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో గంగారాంతాండా సమీపంలోని రహదారిపై మరణించి ఉన్నారు. మృతికిగలకారణాలు తెలియరాలేదు. ప్రమాదవశాత్తూ వాహనం బోల్తాపడి మృతిచెందారా? గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాలను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబాలకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిలు వివరించారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆడ్మిషన్లు పెంచాలి

**-జిల్లా కలెక్టర్ హైమావతి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల జూనియర్ కళాశాలలు,సంక్షేమ వసతిగృహాల్లో అన్నిసౌకర్యాలు సమకూర్చి విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లాకలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంక్షేమశాఖల అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నుంచి మంజూ రైన నిధులను కళాశాలల పెయిటింగ్, టేబుల్స్, డ్యూయల్ డెస్కులు, విండోస్ రిపేర్ చేయించుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అత్యవసర తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని ఇంజనీరింగ్ ఏజెన్సీ కావాల్సినవాటికి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించారు. కళాశాలలకు రావడానికి బస్సుసౌకర్యం కోసం ఆర్టీసి అధికారులతో మాట్లాడాలన్నారు. కళాశాలల్లో ఒక్క సీటు కూడా మిగలకుండా అన్ని సీట్లను భర్తీచేయాలన్నారు. అధికారులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులపట్ల మానవీయకోణంలో అలోచించాలన్నారు. విద్యార్థుల భద్రతలో రాజీపడొద్దని ఆదేశించారు. సమా వేశంలో డిఐఈఓ రవీందర్‌రెడ్డి, ఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, డిబిసిడిఓ నాగరాజమ్మ, డిఎస్సిడిఓ కవిత, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలి...

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**పెద్దశంకరంపేట, జూలై 3, ప్రభాతవార్త:**
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోవిద్యార్థులను నమోదుశాతం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి వసతులు, విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతోకలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూప్రకారం నాణ్యతాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో గణిత టీచర్‌గా మారి గణిత పాఠాలు బోధించారు. దాదాపు 30నిమిషాలపాటు గణితం ఎలా నేర్చుకోవాలి? ఎలా ఒడిసి పట్టాలి? అని మెలకువలునేర్పిస్తూ గణితంలో ఉన్న సిద్ధాంతాలను బోధించారు. ప్రధానోపాధ్యాయులను పిలిపించి పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్నవనరు లు, గతసంవత్సరం విద్యార్థులఉత్తీర్ణతాశాతం తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో షాకీర్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు గణిత పాఠాలను బోధిస్తున్న జిల్లా కలెక్టర్

**నిరుపేదలకు మెరుగైన వైద్యం..**
నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఇన్‌పేషెంట్లు, అవుట్‌పేషెంట్లు ఎంతమంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్టిలోపెట్టుకొని సీజనల్‌వ్యాధుల పట్ల ప్రత్యేకదృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రింగురోడ్డు మూలమలుపులు లేకుండా చూసుకోవాలి

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఒక పిజి కోర్సు మంజూరు**
**-అభివృద్ధిపనులకు అధికారులు వెంటనే అనుమతులివ్వాలి**
**-జిల్లా కలెక్టర్ హైమావతి**



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, జూలై 3, ప్రభాతవార్త:**
హుస్నాబాద్‌కు నిర్మించబోయే రింగురోడ్డు నిర్మాణ పనుల్లో ఇంజనీర్లు మూలమలుపులు ఎక్కువగాలేకుండా వాహనదారులు సులభంగా వెళ్లేవిధంగా మ్యాపింగ్‌చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్‌కార్యాలయంలో నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు 4వరుసల రహదారి నిర్మాణం పనులకు ఆయాశాఖల అధికారులు వేగంగా అనుమతులు ఇచ్చి టెండర్‌ను పూర్తిచేసి పనులు మొదలు పెట్టాలన్నారు. అక్కన్నపేట మండలంలోని అంతకపేటగ్రామంలో 220విద్యుత్ జంక్షన్ కోసం తహసీలాదర్‌వద్ద 10ఎకరాలస్థలం ఉందని సంబంధిత అధికారులు వెంటనే అనుమతులుతీసుకుని పనులు పూర్తిచేయాలని, హుస్నాబాద్ మండలంలోని జిల్లలగడ్డ వద్ద శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలకు సంబందించిన స్థలసేకరణ పూర్తి చేశామని రాష్ట్రప్రభుత్వ అనుమతులురాగానే ఇంజనీరింగ్ అధికారులకు అందజేస్తామన్నారు. పట్టణంలోని కొత్తచెరువు అభివృద్ధిపనుల కోసం ఇరిగేషన్ అధికారులు అన్ని అనుమతులు వెంటనే ఇవ్వాలన్నారు. కోహెడ మండలంలోని బస్వాపూర్ పోరెడ్డిపల్లి కాల్వల ద్వారా రంగనాయక్‌సాగర్ నుండి నీటిని అందించేందుకు భూసేకరణ అవార్డు స్టేజ్ పూర్తయిందన్నారు. హుస్నాబాద్ నుండి జనగామ వరకు నిర్మించే రోడ్డు నిర్మాణం ప్రపోజల్‌స్టేజ్‌లో ఉందని నాక్‌సెంటర్ కోసం స్థలం సేకరించినట్లు వివరించారు. హుస్నాబాద్ పట్టణంలో ఆర్టీఎ యూనిట్ కార్యాలయం కోసం భూమిని అందించామని అది ప్రపోజల్ స్టేజ్‌లో ఉందన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనంగా ఒక పిజికోర్సు ఎంకామ్ 60సీట్లతో మంజూరైందన్నారు. మూడుమండలాలలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు గ్రౌండింగ్‌పూర్తిచేయాలని ఈవిషయంపై ఎంపిడివోలు,మున్సిపల్‌అధికారులు దృష్టిపెట్టాలన్నారు. హుస్నాబాద్‌లో 150పడకల ఆసుపత్రి, కోహెడలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, సింగరాయ ప్రాజెక్టు ఆనకట్ట, ఇండస్ట్రియల్ పార్క్, హుస్నాబాద్‌లో ఎల్లమ్మచెరువు సుందరీకరణపనులు, స్పోర్ట్స్ స్టేడియంలో స్విమ్మింగ్‌పూల్, జిమ్ ప్రతిపాదనల గురించి అధికారులతో కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఆర్డీవో రాంమూర్తితోపాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

# కమలాపూర్‌లో వ్యక్తి దారుణ హత్య..

**పెద్దశంకరంపేట, జూలై 3, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేట మండలపరిధిలోని కమలాపూర్‌గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓవ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని కమలాపూర్‌గ్రామానికి చెందిన తోట సుధాకర్(45) ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రించగా గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి తోట సుధాకర్‌పై దాడి చేయడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయమే సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ అల్లాదుర్గం సిఐ రేణుక పెద్దశంకరంపేట, అల్లాదుర్గం ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్ స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షి ంచారు. జాగిలాలు. క్లూస్ టీంతో సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుని తల్లి తోట మానెమ్మ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతి

**కంది, జులై 3, ప్రభాతవార్త:**
జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చేర్యాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డిలోని చాణక్యపురికాలనీకిచెందిన రాజేశ్వర్ వారంరోజులక్రితం హైద్రాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పోలీసుఠాణాలో ఎస్‌గా విధులు నిర్వహిస్తూ ఉన్నారు. హైద్రాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయంవద్ద బందో బస్తులోపాల్గొని విధులుముగించుకుని కారులో స్వగ్రామానికి పయనమయా డన్నారు. చేర్యాలగేటు వద్ద వేగంగావచ్చిన లారీ కారును బలంగాఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించి క్షతగాత్రుడు రాజేశ్వర్‌ను చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడన్నారు. 199 బ్యాచ్‌కు చెందిన రాజేశ్వర్‌కు భార్య, ఇద్దరుపిల్లలు ఉన్నారు. రాజేశ్వర్ మృతితో పోలీసు శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# మట్కా నిర్వాహకుల బైండోవర్

**జహీరాబాద్,జూలై3,ప్రభాతవార్త:**
పట్టణంలోని శాంతినగర్, రాంనగర్ తదితరకాలనీల్లో మట్కా జూదం ఆడుతున్న వ్యక్తులను తహసీల్దార్‌ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్సై కథనం ప్రకారం, ఆయాకాలనీల్లో మట్కా ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో సంఘటన స్థలాలకు చేరుకుని డబ్బులు పెట్టి మట్కాజూదం సెల్‌ఫోన్‌తో ఆడుతున్న మహమ్మద్ సమ్మియోద్దిన్, బొమ్మెళ రాములు, గుర్రం శ్రీనివాస్, మహమ్మద్ ఖాజా పాషా అలియాస్ అడ్డులు పట్టుబడ్డారన్నారు. పట్టుబడినవారి నుంచి 5సెల్‌ఫోన్లు, రూ.9700 నగదును స్వాధీనంచేసుకుని సుమోటోగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు వివరించారు. మట్కా ఆడుతున్న నలుగురితోపాటు మట్కా నిర్వాహకులు మహమ్మద్ అమీర్, మాణికప్ప శ్రీకర్, మహమ్మద్ రఫీఖ్, బోయిని నర్సింలు, మగ్రి శివశంకర్, చాంద్‌పాషాలను తహసీల్దార్‌ముందు బైండోవర్‌చేసినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.



తహసీల్దార్‌ముందు మట్కానిర్వాహకుల బైండోవర్

# దొంగల ముఠా అరెస్టు-పరారీలో ఇద్దరు

**-9తులాల బంగారం, 22.5.తులాల వెండి, 3బైకులు, సెల్‌ఫోన్ స్వాధీనం**
**-వివరాలను వెల్లడించిన హుస్నాబాద్ ఎసిపి సదానందం**

**కొమురవెల్లి,జూలై 3,ప్రభాతవార్త:**
ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను ఎట్టకేలకు పట్టుకొని గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా హుస్నాబాద్ ఎసిపి సదానందం, చేర్యాల సిఐ ఎల్. శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజుతో కలిసి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులు కొత్తగూడెం జిల్లాకు చెందిన బిజిలి సురేష్, మహబూబాబాద్ జిల్లాకు చెందిన జంపయ్య, దాసరి అశోక్, ముదగోని సురేష్‌లు ముఠాగా ఏర్పడి హైదరాబాద్ నేరేడ్‌మెట్, వినాయక నగర్‌లో కిరాయికి ఉంటూ భక్తులమాదిరిగా తరచు కొమురవెల్లికి వచ్చి గదులు అద్దెకు తీసుకొని భక్తులమాదిరిగా బొట్టుపెట్టుకొని పగలు రెక్కీ నిర్వహించి తాళంవేసిన ఇళ్లను టార్గెట్‌చేసి రాత్రిసమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నలుగురు నిందితులపై పాత కేసులు ఉన్నాయన్నారు. పరిసరప్రాంతాలలో 18దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులు కూజ నర్సయ్య, అంగడి రవి పరారీలో ఉన్నట్లు వివరించారు. పట్టుబడ్డ వారినుంచి 9తులాల బంగారం, 22.5 తులాల వెండి, ఒక ఇనుపరాడ్డు, 3బైకులు ఒకఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి సదానందం వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగలముఠాను పట్టుకున్న కొమురవెల్లి ఎస్ఐ రాజు, కానిస్టేబుల్ రమేష్‌ను ఎసిపి సదానందం అభినందించారు.



వివరాలనువెల్లడిస్తున్న ఎసిపిసదానందం

## ఆంధ్రా కులాలను బిసి జాబితాలో కలపొద్దు

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** తెలంగాణలో తొలగించిన 27 ఆంధ్రా కులాలను బీసీ జాబితాలో కలపవద్దని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. ఆంధ్రా కులాలను తిరిగి బీసీ జాబితాలో కలిపితే తెలంగాణ బీసీలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీలకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు డాక్టర్ భాగయ్య, గడప శ్రీహరి, కంటే రామచందర్, మల్లేష్, కొమరయ్య, అంబటి సుధాకర్ గంగపుత్ర పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌ను కలిసిన బండి రమేష్



కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జులై 3, ప్రభాతవార్త**

టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మూసాపేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వర్షాకాలం వరదలను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సూచించారు.

## అధికారులు అంకితభావంతో పనిచేయాలి

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్




జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క అధికారి అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ కార్యాలయంలో అధికారులతో కలసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, వీధి దీపాల సమస్యలు ఎక్కడ ఉన్నా తక్షణమే మరమ్మత్తులు చేయాలని, అవసరమైతే కొత్త వాటిని ఏర్పాటుచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమీషనర్ రవికిరణ్, డిప్యూటి మున్సిపల్ కమీషనర్ మారుతి దివాకర్, అసిస్టెంట్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హేమలత, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంతి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.


### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలోకి టిఆర్ఎస్ (డి)



సమావేశంలో మాట్లాడుతున్న నరాల సత్యనారాయణ

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (డి) అభ్యర్థిని ఎన్నికల భరిలోకి దించుతామని సమితి తెలిపింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ పోటి చేసే అభ్యర్థి కంచర్ల మంజుష పేరును కూడా ప్రకటించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ పార్టీకి 5 వేలమంది సభ్యత్వం ఉందని, ఇంకా కొనసాగుతున్నదని, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర చేపడతామన్నారు. విద్యావంతురాలైన కంచర్ల మంజుషకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, రాజకీయ నేపథ్యం కుటుంబం నుంచి వచ్చిన ఆమె తమ పార్టీలో కార్యనిర్వహక అధ్యక్షురాలిగా కొనసాగుతున్నదని చెప్పారు. బనకచర్ల లింకు ప్రాజెక్టుపై ఈ నెల 19న తేదీన తమ పార్టీ ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నదని, ఎపి ప్రభుత్వం 200 టిఎంసి గోదావరి జలాలను కృష్ణ బెసిన్ మీదగా పెన్నా బెసిన్‌కు మళ్లించేందుకు గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్లతో చేపడుతున్నదని ఆరోపించారు. 3వేల టిఎంసి నికర జలాలను ఉపయోగించుకుంటే రాష్ట్రంలో 4 పంటలు పండించుకోవచ్చునని సూచించారు. మంజుష మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పారు. తెలంగాణ ప్రజలకు రక్షన కలి ్పంచే పార్టీ తమదేనన్నారు.

### మంత్రి తుమ్మల నాగేశ్వరావుని కలిసిన స్వామి ముదిరాజ్



**పేట్ బషీరాబాద్, జులై 3, ప్రభాతవార్త**

తెలంగాణ ముదిరాజ్ మహాస రాష్ట్ర కార్యదర్శి గుమ్ముల స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి తూముల నాగేశ్వరరావుని కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ముదిరాజ్ మహాసభ సభ్యులు గుమ్మడి మధుసూదన్ రాజు, పెంటయ్య, రమేష్, నరేందర్, నరసింహ, వెంకటేష్, చెన్నయ్య ముదిరాజ్, శివ, నరసింహ, సూర్యనారాయణ బంధుమిత్రులతో కలిశారు.

## భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలు : డా. కె.వి.రమణాచారి



ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, పద్మనాభరావు, రఘురామ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 3 ప్రభాతవార్త :** భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలని, అవి మన జ్ఞానానికి మూలం... వాటిని లోతుగా పరిశీలించి అధ్యయనం చేయాలని తద్వారా ఆధ్యాత్మిక, మానసిక వికాసశక్తి పెరుగుతుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఢిల్లీ దూరదర్శన్ పూర్వ అదనపు డైరెక్టర్ డా. రేవూరి అనంత పద్మనాభరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు మల్లం వీరేందర్, సవరం వెంకటేశ్వరరావు, డా. వి.ఎ.కుమారస్వామిశాస్త్రి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో ప్రముఖ రచయిత డా. చిట్టావూరి శివరామకృష్ణశర్మ రచించిన ఋగ్వేదానికి రాహుల్ గ్రహం గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. దేశాన్ని మొగల్ చక్రవర్తులు, అనంతరకాలంలో బ్రిటిష్‌వారు పాలించిన సమయంలో అత్యంత విలువైన భారతీయ వేదాలు, వైద్య విజ్ఞానశాస్త్రాలు వక్రీకరణ జరిగాయన్నారు. రచయిత తన ఆంగ్ల గ్రంథంలో మనదేశ వాస్తవిక చరిత్ర మార్పులుతో వక్రీకరణకు గురైన వివరాలు సహేతుకంగా వివరించారన్నారు. అలాగే రాహుల్ సాంకృత్యాయన్ ఋగ్వేదంపై చేసిన వక్రవ్యాఖ్యానాలను శర్మ తన తెలుగు గ్రంథంలో తీవ్రంగా ఖండించారని తెలిపారు. రచయిత తన స్పందనలో సత్యాన్ని సమాజం ముందు ఉంచాలనే ప్రయత్నం చేస్తున్నానని స్పష్టం చేశారు.

### కొలకలూరి ఇనాక్ సాహిత్యం మానవీయతకు ప్రతీకలు : ఏనుగు నరసింహా రెడ్డి



కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** కొలకలూరి ఇనాక్ దళిత వాద సాహితీ వేత్త గా భావిస్తారు అని, కాని ఆయన అణగారిన వర్గాల పక్షపాతి అని ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. అయన సాహిత్యం మానవీయతకు ప్రతీకలు అని ఉదహరించారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వాహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం లో భాగంగా డాక్టర్ అరుణ గంధం రచించిన కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఏనుగు నరసింహా రెడ్డి పాల్గొని సంపుటి నీ ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యంకు మంచి కానుక అరుణ అందించిన ఇనాక్ సాహిత్యం పై వ్యాస సంపుటి అని అభినందించారు. సినీ కళాకారులకు అభిమాన సంఘాలు వుంటాయని, కానీ ప్రజా చైతన్యం కోసం జీవితమంతా కృషి చేసే సాహితీ కారులకు అభిమాన సంఘాలు లేక పోవటం విచార కరం అన్నారు. గాన సభ వారు ఏడు సంవత్సరాలు గా ఇనాక్ సాహితీ సప్తహం నిర్వహిస్తూ ఆయనకు అభిమాన సంఘంగా మారారని అభివర్ణించారు. ఇనాక్ కు జ్ఞాన పీఠం ఇంకా రాకున్నా దానికన్నా ఎత్తు పీఠంకు ఎదిగిన సాహితీ ఋషి అని చెప్పారు. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమ నేపథ్యం లో ఇనాక్ సాహితీ సృజన ఉందని అన్నారు. ఆయన సాహిత్యం స్వతంత్ర భారతీయ ఆత్మను ప్రతిబింబిస్తుందన్నారు. దళిత వాదం కన్నా మానవీయ చైతన్యం కాలం భావ జాలాన్ని గ్రహించడం ఇనాక్ సాహిత్య నేపథ్యం అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై నాట్య గురువు రేణుకా ప్రభాకర్, కిన్నెర రఘురాం, గంధం అరుణ, ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు

## సాయిబాబా ఆలయం వద్ద గోశాల ఏర్పాటుకు సహకరిస్తా

### - మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి



హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి.

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో గోశాల నిర్మాణంకు నావంతు పూర్తి సహకారం అందిస్తానని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయిబాబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు టింకురెడ్డి, నర్సింగ్‌రావ్, కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. ఆలయాల వద్ద ఉన్న ధ్వజస్థంభం, గర్భగుడి పైనున్న శిఖరాలు అంతరిక్షంలోని శక్తిని గ్రహించి ఆలయం లోపల, ఆవరణలో నిక్షిప్తం చేస్తాయన్నారు. దీని కారణంగానే ఆలయాలకు వెళ్లే భక్తులకు శారీరక, మానసిక అలసట తీరి, ప్రశాంతత లభిస్తుందన్నారు. సనాతర ధర్మంను ఆచరించే ప్రతీ ఒక్కరూ తమ బిడ్డలను విధిగా ఆలయాలకు తీసుకెళ్లాలని, మన ధర్మంను మనం భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ, ఇతరుల మతాలను గౌరవించాలని సూచించారు. ఈ లోకంలో సర్వేజనః సుఖినోభవంతు అని కోరుకునేది సనాతన ధర్మంను ఆచరించే వారు మాత్రమే అన్నారు. మన ఆరోగ్య పరిరక్షణ కోసం, ఆధ్యాత్మిక వికాసానికి, ప్రకృతి పరిరక్షణకు మన మహర్షులు అనేక సదాచారాలు, పద్ధతులు పెట్టారన్నారు. గోవులో ముక్కోటి దేవతలుంటారని, గోవును నిత్యం పూజించి ఏ పని చేసినా దిగ్విజయంగా పూర్తవుతుందని, గోవు పేడ, మూత్రంతో సేంద్రీయ ఎరువులు తయారు చేసి పండించిన ఆహార ధాన్యాలను తీసుకుంటే సకల రోగాలు దూరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆగస్టు 21న 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ 'అవార్డులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వసుంధర, సిమి,ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు

**హైదరాబాద్,జూలై 3,ప్రభాతవార్త:**

హైదరాబాద్ అభివృద్ధికి పాలుపంచుకొంటూ రియల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నసామాన్యులకు ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఆవార్డ్స్ 2025 అందిస్తున్నట్లు గుర్తింపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పుల వసుంధర తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించి మీడియాతో మాట్లాడుతూ తమ అవార్డులు తీసుకున్న వారికి ఉచిత బ్రాండింగ్, మార్కెటింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గుర్తింపు ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఇప్పటికే ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. విద్యార్థుల స్టార్టప్ వివిధ అంశాలలో ఆప్ స్కిల్, ఇంకుటేషన్, ప్రభుత్వం తరపున ఫండింగ్ సపోర్టు అందిస్తామని తెలిపారు. 18-30 ఏళ్ల వయసున్న స్టూడెంట్స్, ఇన్నోవేటర్స్, స్టార్టప్ కాంపిటీషన్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ నెల 27లోపు ప్రైడ్ అఫ్ హైదరాబాద్ అవార్డు నామినేషన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆగస్టు 21న జరిగే ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఈవెంట్లో విజేతలకు రూ.లక్ష బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. సమావేశంలో ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు సిమి ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావును కలిసిన బిజెపి నాయకులు



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రారావును సన్మానిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 3 ప్రభాతవార్త :**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన ఎన్.రామచంద్రరావును గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇం ఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రామ చంద్రరావుకు పుష్ప గుచ్చం అంద జేసి శాలువతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ అధ్యక్షులు అడికె జనార్ధన్. బిజెపి నాయకులు నర్సిరెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి, మన్మోహన్ నెడ్డి, ఎన్.శంకర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### మణికొండలో కన్నుల పండువగా జగన్నాథ స్వామి రథయాత్ర



మణికొండలో భక్తికుటీర్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొన్న మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్.

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం భక్తికుటీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర" కన్నుల పండువగా సాగింది. ఈ రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తజనులు పాల్గొని జగన్నాథుడి లీలలను స్తుతిస్తూ మైమరిచిపోయారు. ఈ వేడుకల్లో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం భగవన్నామ స్మరణం చేస్తే సర్వ పాపాలు హరించుకుపోతాయన్నారు. పంచభూతాలు, సూర్యచంద్రులు, సకల లోకాలు అన్నింటిని సరైన దిశలో నడిపించేది ఆ జగన్నాథ స్వామేనని వివరించారు. ప్రతీ హిందువు రోజులో కనీసం గంట సమయంను మన ఆధ్యాత్మిక అంశాలను తెలిపే పుస్తకాలు చదువాలని, భజనల్లో పాల్గొనాలని, దేవాలయాలకు వెళ్లడంను దిన చర్యలో భాగం చేసుకోవాలని, ధ్యానం చేయాలని సూచించారు. సాటి వారికి సహాయం చేయడంలో కలిగే తృప్తి అనంతమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, నాయకులు కిరణ్, పురుషోత్తం, ముత్యాలు, ప్రభావతి, శ్రీనివాస్, శ్రీపతి, పెద్ద సంఖ్యలో భక్త సమూహం పాల్గొన్నారు.

## ప్రతి ఏడాది ఏకలవ్యుడి జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలి



ఏకలవ్యుడి చిత్రపటానికి నమస్కారాలు తెలియజేస్తున్న ప్రజా సమితి నాయకులు

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** ప్రపంచంలో అత్యంత విలువైనది గురు, శిష్యుల బంధమని, నాటి కాలంలో తెలియజేసిన మహానుభావుడు ఏకలవ్యుడని ఈయన జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి డిమాండ్ చేసింది. మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తిని చాటి ఔన్యత్వంను తెలియజేశారని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి చెప్పారు. ప్రజా సమితి ఆధ్వర యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది జనాభా కలిగిన ఎరుకల జాతి ఉందని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రతి ఏడాది ప్రభుత్వం ఆయన జయంతిని నిర్వహించాలన్నారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశిమికి 5 రోజుల ముందు తమ సమితి ఏకలవ్యుడి జయంతిని నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. అలాగే ట్యాంక్‌బండ్‌పైన ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, 33 జిల్లాల్లో కూడా విగ్రహాలను ఏర్పాటు చేసి జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా ఏకలవ్య కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు దుగ్యాల ఉపేందర్, అంజయ్య, శ్రీనివాస్, తిరుపతి సంపత్, కుమారస్వామి పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



బిసి విద్యార్థి సమావేశంలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త**

హైకోర్టు ఇచ్చిన గడువుకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బిసి భవన్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243/డి ప్రకారం రాష్ట్రానికి పూర్తి అధికారం ఉందని, 42 శాతం రిజర్వేషన్ల సాధించే వరకు పోరాటం ఆగదన్నారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు చేసుకున్న ప్రతి బిసి విద్యార్థికి గురుకులాల్లో అడ్మిషన్లు కల్పించాలని, అదనంగా గురుకులాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతను సమాయత్తం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఆర్.కృష్ణయ్య అయన్ను సత్కరించి అభినందించారు.

### కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి తొట్టెలకు పూజలు చేసిన బిజెపి నాయకులు గోవింద్‌రాఠి

**బేగంబజార్, జూలై3 ప్రభాతవార్త:**

బోనాలు ఉత్సవాలను పురస్కరించుకుని పాతనగరంలోని పురానాపూల్ స్వామి వివేకనందనగర్ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా కనకదుర్గ ఆలయంలో అభిషేకాలు, కుంకమార్చన ప్రత్యేక పూజలతోపాటు రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తొట్టెలను బ్యాండు మేళాల మధ్య యువకుల ఆటపాటలు, పోతరాజు మధ్య నృత్యాలు చేశారు. ఆలయంనుంచి బయలు దేరిన అమ్మవారిని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు హారుతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టి పూజలను చేశారు. అమ్మవారి తొట్టెలకు బిజెపి నాయకులు గోవింద్‌రాఠి, బిఆర్ఎస్ నాయకులు ముత్యాల గోవింద్‌రాజు, సంఘం అధ్యక్షులు ఎంపి. సదానంద్, సంఘ సేవకులు ఎంపి.భీష్మా తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. స్మైహి టీమ్ ప్రతినిధులు కొన్నింటి సుధాకర్, పి. కిరణ్‌కుమార్, ఎం.సతీషన, మిర్చి, పి.భరత్‌సాయి, విద్యాసాగర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి : కార్పొరేటర్



ఆలయాల వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**పురానాపూల్, జూలై 3ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని పురానాపూల్ డివిజన్ పరిధిలోని అలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నంరాజ్ మోహన్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని చిన్నబజార్, రత్నాబాయి గల్లీ, ఎస్.వినగర్, చంద్రిక పురం తదితర ప్రాంతాలల్లో ఆయా విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడం తోపాటు బోనాల పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అదే విద్యుత్ దీపాలు, ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంబాలను తొలగించి దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### రూ.75 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జులై 3 ప్రభాతవార్త :** నాచారం డివిజన్లో రూ.75 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సావర్కర్ నగర్ రోడ్ నెంబర్ మూడు లో ఎరుకల బస్తీలో మరియు శ్రీరామ్ నగర్‌లో, వీఎస్టీ కాలనీలలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నాచారం డివిజన్ ను నెంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని చెప్పారు. తొందరలోనే పటేల్ కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తామని అలాగే రాబోయే రోజుల్లో చెరువులోకి మురుగునీరు రాకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ. బాలకృష్ణ ఎఈ. వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్, బారాసా నాయకులు కార్యకర్తలు సావర్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎరుకల బస్తి వాసులు శ్రీరామ్ నగర్ కాలనీవాసులు, విఎస్టి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్

### పిసిసి ప్రధాన కార్యదర్శులకు సన్మానం



పిసిసి ప్రధాన కార్యదర్శులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను సన్మానిస్తున్న బాలగౌని బాల్‌రాజుగౌడ్, అయిలి వెంకన్న గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 3 ప్రభాతవార్త**

పిసిసి ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన గౌడ నేతలను గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఘనంగా సన్మానించింది. గురువారం చిక్కడపల్లిలోని కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ కార్యాలయంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. గౌడ కలుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్ ,గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ ,బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ దుర్గయ్య గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్య క్షులు సింగం నాగేశ్వర్ గౌడ్ ,బాలగొని వెంకటేష్‌గౌడ్, పోతగాని ఐలెన్ గౌడ్ తదితరులు రామారావుగౌడ్, సత్యంగౌడ్‌లను సత్కరించారు.

### సేఫ్టీ పరికరాలను వినియోగించాలి : ఎస్సీ వెంకన్న



సెఫ్టీ పరికరాలను అందచేస్తున్న ఎస్ఇ వెంకన్న

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:**

విద్యుత్ ప్రమాదాల బారిన పడుకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఇ పి. వెంకన్న అన్నారు. మెహిదిపట్నం డివిజన్ లో విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని సిబ్బంది కి విద్యుత్ సేఫ్టీ పరికరాలను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత పరికరాలు తప్పనిసరిగా వినియోగిస్తే ప్రమాదాలు జరగవన్నారు.


### పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి




కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,నాయకులు

**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగువ తేదీన ఎల్‌బి స్టేడియంలో జరగనున్న బహిరంగ సభకు బ్లాకు అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా స్థాయి నాయకులు, అనుబంధ సంస్థల కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్, సయ్యద్ ఇక్బాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆహ్వానపత్రిక అందజేత



**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ ఆలయంలో ఈ నెల 20వ తేదీన జరగనున్న బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కలిసి కమిటి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ బి.మారుతి యాదవ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# డయాలసిస్ సెంటర్ లేక రోగుల అవస్థలు

## -అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు!




రామాయంపేట నూతన ప్రభుత్వ ఆసుపత్రి ముఖచిత్రం

**రామాయంపేట, జూలై 3, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో డయాలసిస్ కేంద్రం లేకపోవడం వల్ల డయాలసిస్ చికిత్స రోగుల పాలిట శాపంగా మారింది. నిత్యం పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందు బాటులో లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.5కోట్ల తో అత్యాధునికంగా నిర్మించిన ప్రభుత్వ ఆసు పత్రిలో కూడా ఈ అత్యవసరసేవలను అందించక పోవడంపై స్థానికులు, రోగుల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**దూర ప్రయాణాలతో పెరుగుతున్న ఆర్థిక, శారీరక భారం...**
ప్రస్తుతం రామాయంపేట పట్టణం నుండి సుమారు 50 మందికి పైగా రోగులు డయాలసిస్ సేవలు పొందుతున్నట్లు అంచనా. వారందరూ ప్రతివారం రెండునుంచి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవడానికి కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రయాణాల వల్ల వారికి తీరని ఆర్థిక భారం పడుతోంది. ఒక్కో డయాలసిస్ సెషన్‌కు సుమారు రూ.2,000నుండి రూ.3,000వరకు ఖర్చు అవుతుందని,దీనికితోడు ప్రయాణఖర్చులు, సమయం కూడా అదనపు భారం అని రోగుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. డయాలసిస్ చేయించుకున్న తర్వాత బలహీనంగా ఉండే రోగులు అంతదూరం ప్రయాణించి తిరిగి రావడం వల్ల మరింత అలసిపోతున్నారని, కొందరు అనారోగ్యానికి గురవుతున్నారని చెబుతున్నారు.

**కొత్త ఆసుపత్రి ఉన్నా, డయాలసిస్ కేంద్రం ఎందుకు లేదు?...**
రామాయంపేట పట్టణం జాతీయ రహదారిపై ఉండటం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది కేంద్రంగా ఉండటంతో ఇక్కడ డయాలసిస్ సెంటర్ ఆవశ్యకత మరింత ఎక్కువగా ఉంది. కోట్లాదిరూపాయలు వెచ్చించి నిర్మించిన నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలను విస్త రించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. గతంలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, ఇప్పటివరకు అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు.

**మా కష్టాలు ఎవరికీ పట్టవా?**
కిడ్నీ వ్యాధిగ్రస్థుల ఆరోగ్యంతో ఆటలాడకుండా, తక్షణమే రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బాధితులు, సామాజిక కార్యకర్తలు జిల్లా ఉన్నతాధికా రులను, స్థానిక ప్రజాప్రతినిధులను డిమాండ్‌చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిచ్చి, ఈవిషయం లో సానుకూలంగా స్పందించి, త్వరగా డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆశిస్తు న్నారు. లేకపోతే ఈసమస్య మరింత తీవ్రమై, రోగుల పరిస్థితి విషమిస్తుందని హెచ్చరిస్తున్నారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు ఉచితభోజనం అందిస్తున్న సేవాసమితి

**సిద్దిపేట అర్బన్, జూలై 3, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్రికులకు కోసం ఏర్పాటుచేసిన మూడు అన్న దానకేంద్రాలలో ఉచితంగా తెలంగాణ రుచికరమైనభోజనాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి యాత్రికులకు అన్నప్రసాదం చేస్తున్నారు. బాల్తాల్, లంగర్, పంచతరని లంగర్ ప్రాంతంలో సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదానసేవ సమితి ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. లంగర్‌లో అన్నదాన సేవలు అందించే కార్యక్రమంలో అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి చైర్మన్ చీకోటి మధు సూదన్, అధ్యక్షులు కాచం కాశీనాథ్, కార్యవర్గ సభ్యులు చింత శ్రీనివాస్, కొర్తివాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతతోనే అంటూ వ్యాధులు దూరం

**నంగునూర్, జూలై 3, ప్రభాతవార్త :**
పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దూరమవుతాయని రాజగోపాల్‌పేట పిహెచ్‌సి వైద్యాధికారి సరిత అన్నారు. గురువారం మండల పరిధిలోని పాలమాకుల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతిగృహం ఆమెపరిశీలించి మాట్లాడారు. హాస్టల్ విద్యా ర్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం హాస్టల్లోని వంటగది, విద్యార్థుల విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. పరిసరాల శుభ్రతతో పాటు పిల్లల వ్యక్తిగత శుభ్రతపై వార్డెన్ గణేష్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ గణేష్, హెచ్‌ఈవో స్వామి, హెల్త్ సూపర్‌వైజర్ అనురాధ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్, ఎఎన్‌ఎం జ్యోతి, ఆశ సిబ్బంది కవిత, మనెమ్మ, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లతో జీవితాలను పాడు చేసుకోవద్దు

**-ఎస్‌ఐ ఎండి ఆసిఫ్**

**నంగునూర్, జూలై 3, ప్రభాతవార్త:**
చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకొవొద్దని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్ అన్నారు. మండల పరిధిలోని మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దాసరి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిసారించాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమొద్దన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. డ్రగ్, గంజాయి ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి,సత్తయ్య, గోవర్ధన్, అదిరాల సాయినాథ్ శర్మ, రాజయ్య, రాజు, షీటీమ్స్ బృందం, పోలీసు సిబ్బంది కిషన్, మమత, రజని, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసమూర్తికి డాక్టరేట్ ప్రదానం

**సదాశివపేట, జూలై 3, ప్రభాతవార్త:**
సదాశవపేటకు చెందిన జ్యోతిష్య పండితుడు కె.శ్రీనివాసమూర్తికి జ్యోతిష్యంలో గౌరవ డాక్టరేట్ లభించింది. గత ఇరువై సంవత్సరాలుగా జ్యోతిష్య,వాస్తు శాస్త్రాల ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి చైన్నైకి చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనవర్సిటి వారు ఈ అవార్డును ప్రధానం చేశారు.చెన్నైలోని మైలాపూర్‌లో గల భారతీయ విద్యాభవన్‌లో జరిగిన డాక్టరేట్ ప్రధానోత్సవ సభలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గతంలో వివిధ సంస్థలు ద్వారా ఆయన అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డు ప్రధానోత్సవ సభలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటి చాన్స్‌లర్ వెంకటేశన్,అటామిక్ ఎనర్జీ చీఫ్ జనరల్ మేనేజర్ సెల్వరాజన్,స్పెషల్ కమీషనర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సంపత్‌కుమార్,ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ లెఫ్టనెంట్ కల్నల్ గణేషన్,సైబర్‌క్రైం రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ తంగరాజు,లండన్ అంబాసిడర్ పరవేందర్‌ఇంగ్‌లు పాల్గొన్నారు.

## కార్యదర్శిపై ఫిర్యాదు సరికాదు



ఎంపిడివో దామోదర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

**చిన్నశంకరంపేట, జూలై 3, ప్రభాతవార్త:**
విధులు సక్రమంగా నిర్వర్తించలేదని పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేయడం సరికాదని ఎంపిటిసిల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మండల పరిధి చందంపేట పంచాయతీ కార్యదర్శి పద్మ విధులు సక్రమంగా నిర్వహించడంలేదని గ్రామస్థులు కొందరు ఎంపివో గిరిజారాణికి ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాభివృద్ధికోసం గ్రామకార్యదర్శి నిజాయితీతో పని చేశారన్నారు. గురువారం ఈమేరకు పంచాయతీ కార్యదర్శి పద్మపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కొందరు గ్రామస్థులతో కలిసి ఎంపిడివో దామోదర్‌కు వినతిపత్రం అందించారు.

## పదోన్నతి పొందిన డిప్యూటీ ఎస్‌ఇ ఘనసన్మానం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 3, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో పనిచేస్తూ డిప్యూటీ ఎస్.ఈ.గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న రాజేంద్ర ప్రసాద్ ను, నీటిపారుదల శాఖ ఉద్యోగులందరూ బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. రాజేంద్ర ప్రసాద్ ఉద్యోగ రిత్య చేసిన సేవలను కొనియాడారు. వీడ్కోలు కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణానందస్వామి ఆశ్రమంలో ఘనంగా రెండవ వార్షికోత్సవ ఉత్సవాలు



ప్రవచనాలు ప్రబోధిస్తున్న మాధవానందసరస్వతిస్వామి

**నర్సాపూర్ జూలై 3, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని మహమ్మదాబాద్ గ్రామంలోగల కృష్ణా నందస్వామి ఆశ్రమంలో ఆశ్రమ రెండవ వారికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానందసరస్వతిస్వామి హాజరయ్యారు. వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలతో పాటు మన్యుసూక్త అభిషేకం, రుద్రయాగం వంటి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవానందసరస్వతిస్వామి మాట్లాడుతూ ఈ ఆశ్రమంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఈ మేరకు ఆశ్రమంలో మాధవానందసరస్వతిస్వామి భక్తులకు ఆధ్యాత్మికవేత్త లకు ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటలకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం ప్రతిరోజు మధ్యాహ్నం భక్తులకు వేదాంత ప్రవచనములు బోధించనున్నారు. అయితే ధర్మపురి లో వెలిసిన శ్రీ లక్ష్మినర్సింహ్మాస్వామి క్షేత్రంలో సైతం రుద్రయాగం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించన్నున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో బిజెపిపార్టీ మెదక్‌జిల్లా అధ్య క్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, కె.బిక్షపతిచారి, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ హ్నాన్మతు వెంకట రమణారావు,మాజీ జడ్‌పిటిసీ మాధవీ జగదీశ్వర్,మాజీ ఎంపిటీసి మల్లేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం

**-మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ జి.ఆర్.సూర్యరాజ్**

**జోగిపేట, జూలై 3, ప్రభాతవార్త:**
నిస్వార్థంగా సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ఉద్దేశ్యమని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.ఆర్.సూర్యరాజ్ అన్నారు. జోగిపేట లయన్స్‌క్లబ్ యాభవ వార్సికోత్సవ కార్యక్రమాన్ని అందోలులోని ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఏర్పాటైనప్పటినుంచి వందల సంఖ్యలో క్లబ్‌లను ఏర్పాటు చేయటంతోపాటు లక్షలాది మందికి సేవలను అందించినట్లు పేర్కొన్నారు. సేవకు మరోపేరే లయన్స్‌క్లబ్ అని ఆయన అన్నారు.

**కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం...**
జోగిపేట లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.ఆర్.మధుసూధన్‌రెడ్డి, డాక్టర్ జాన్‌పాల్, కార్యదర్శిగా గడ్డమీది సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఎస్.మానిక్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.మల్లేశం, డైరెక్టర్లుగా ఎస్.నారాయణరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎం.విజయ్‌కుమార్, డాక్టర్ దయానంద్, ఎస్.హరినారాయణవర్మ, యశ్వంత్‌రెడ్డి, మార్కెటింగ్ పిఆర్‌వో ఎం.పద్మనాభరెడ్డి, మెంబర్‌షిప్ ఛైర్మెన్ ఎ.రాంబాబు, సర్వీస్ ఛైర్మెన్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, క్లబ్ అడ్వయిజర్లుగా డాక్టర్ అనంతరెడ్డి, యూత్ ఛైర్మెన్ పి.శివశేఖర్, డయాబెటిక్ ఛైర్మెన్ టి.రామక్రిష్ణ, విజన్ ఛైర్మెన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, హంగర్ ఛైర్మెన్ విఠల్‌రావుతాండ్లేలతో మాజీ లయన్స్‌క్లబ్‌గవర్నర్ జి.ఆర్.సూర్యరాజ్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌సీనియర్‌సభ్యులు పద్మావతి, ఆసుపల్లి శ్రీధర్, అనితారెడ్డి, బుచ్చేశ్‌యాదవ్, ఎస్.క్రిష్ణారెడ్డి, రంగసురేష్‌గుప్త, పట్లోల్ల ప్రవీన్‌కుమార్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## 9న సమ్మె జయప్రదం చేయండి

**-కరపత్రం ఆవిష్కరణలో మహిపాల్**

**జహీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:**
ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయవంతం చేయాలని సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్ మహిపాల్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని పలు పరిశ్రమల్లో సమ్మె వాల్‌పోస్టర్‌లను పంపిణీచేశారు. ఈసందర్బంగా మహిపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున కార్మికవ్యతిరేకవిధానాలను అవలంబిస్తూ కార్మికచట్టాలను కాలరా సిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జహీరాబాద్ ప్రాంతంలోని ఆయా కర్మా గారాల్లో పనిచేసుకుంటున్న కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహీంద్రా ఆండ్ మహీంద్రా యూనియన్ ప్రధాన కార్యదర్శి కనకారెడ్డి, ఆయా పరిశ్రమల యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు నరేష్, రాజు, మహేష్, శేఖర్, రాంశెట్టి, బాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వాగ్ధానాన్ని మరిచి ఎంపి చేర్యాలకు రావడం సిగ్గుచేటు

**-బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య**

**చేర్యాల, జూలై 3, ప్రభాతవార్త:**
లోకసభ ఎన్నికల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తానని వాగ్దానాన్ని చేసి చేర్యాలకు రావడం సిగ్గుచేటని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, నాలుగు మండలాల యూత్ ఇంచార్జీ శివగారి అంజయ్య అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో బిఆర్ఎస్వి పట్టణాధ్యక్షులు ఒగ్గు శ్రీశైలం అధ్యక్షతన జరగగా అంజయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో తనను గెలిపిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని మాటతప్పి ఇందిరమ్మ లబ్దిదారులకు పత్రాలపంపిణీ కార్యక్రమానికి రావడం ఎంతవరకు సమంజస మన్నారు. ఇప్పటికెనా ఇచ్చినమాటను నెలబెట్టుకోకుంటే చేర్యాల ప్రాంత ప్రజలను మోసంచేసినవారవుతారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ పట్టణాధ్యక్షులు చింతల పర్శరాములు,యూత్ పట్టణ అధ్యక్షులు యాట బిక్షపతి,కామల్ల అనిల్,రాచకొండ శ్రీనివాస్,పాక బాలయ్య ఉన్నారు.

## ప్రతిరైతు ప్రత్యేకరైతు విశిష్ట సంఖ్యను పొందాలి

**-మండల వ్యవసాయ అధికారిణి దీపిక**




కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారిణి దీపిక

**నర్సాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు కేంద్రప్రభుత్వం పథకాల అమలులో కీలకమైనటువంటి ప్రత్యేకరైతు విశిష్ట గుర్తింపుసంఖ్య పొందాలని నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారిణి దీపిక అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని రంజా తండాలో ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాధికారిణి దీపిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందడానికి తమ వివరాలను ఎఈఓలకు అందజేయాలన్నారు. ఈ మేరకు రైతులకు 11 అంకెలతో కూడినటువంటి ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య అందజేస్తామన్నారు. రైతులు ఈసంఖ్యను పొందడానికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ నెంబర్, ఆధార్ కార్డు జత చేసినటువంటి మొబైల్ ఫోన్ నెంబర్ వంటి వివరాలను వ్యవసాయ శాఖ ఏఈఓ లకు అందించాల్సి ఉంటుందన్నారు. ఈవిశిష్ట గుర్తింపు సంఖ్య కేంద్రప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కోసం ఆమె అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని దీపికతో పాటు ఎఈఓ తేజస్విని, ఆత్మ బిటిఎం హరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నభోజనంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

**బెజ్జంకి, జూలై 3, ప్రభాతవార్త:**
మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలను పాటించాలని మండల ప్రత్యేక అధికారి ఎ.మల్లేశం అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తరగతి, వంట గదులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలల తరగతి, వంట గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో తాజా కూరగా యలు, బియ్యం వినియోగించాలన్నారు. నాణ్యతాప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎండిఎం సూపర్‌వైజర్ ఇన్‌చార్జి కవిత, పాఠశాల హెచ్‌ఎం మాలోత్ సంగీత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా నిలుస్తున్న రఘునందన్‌రావు

**-బిజెపి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి**



ప్రవీణ్‌కు చెక్కు అందజేస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**వర్గల్, జూలై 3, ప్రభాతవార్త:**
ఆపదలో ఉన్న కార్యకర్తలకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అండగా నిలుస్తున్నారని వర్గల్ మండల బిజెపి అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు ఎర్రవాడ ప్రవీణ్ కుమారుడు నిమోనియా వల్ల ఆసుపత్రిలో చేరగా ఎంపి రఘునందన్‌రావు ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3.50 లక్షలు ఇప్పించారని అన్నారు. అట్టి చెక్కును గురువారం ప్రవీణ్‌కు అందజేసినట్లు తెలిపారు. కష్టం వచ్చిన కార్యకర్తలకు అండగా నిలుస్తున్న రఘునందన్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ ఇరి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పపంరి రమేష్, నాయకులు టేకులపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు నర్ర రవిలు పాల్గొన్నారు.

## గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభను విజయవంతం చేయాలి

**-కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**




విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
జూలై 4న శుక్రవారం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో జరగనున్న గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఎఐసిసి నాయకులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాల అధ్యక్షులు మండల అధ్యక్షులు, బ్లాక్ గ్రామ పట్టణ అధ్యక్షులు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధులు అందరూ అధికసంఖ్యలో హాజరై ఈబహిరంగసభ కార్యక్రమాన్ని విజయ వంతంచేయాలని జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్‌పిటీసీ శ్రీనివాస్‌గుప్త, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, కాంగ్రెస్ బిసి సెల్ మండల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్ శివప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను పరిష్కరించాలి

**-మెదక్ జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు**




రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పి డివి శ్రీనివాసరావుతోపాటు సిఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం తదితరులు

**నర్సాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను సమర్థవంతంగా పరిష్కరించాలని మెదక్‌జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు ఐపిఎస్ సూచించారు. గురువారం సాయంత్రం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్లో రికార్డులను, కేసు డైరీలు, హిస్టరీ షీట్స్, ఇంకా పరిష్కారం కాని కేసుల వివరాలను ఆయన పరిశీలించారు. అంతేగాక రాత్రి పహారా బీట్ ఉద్యోగుల పనితీరు, డయల్ 100, 112 కాల్స్ లపై తక్షణ స్పందన గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేగాక రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు అక్రమ రవాణాలు అరికట్టడం సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రత సిసిటివి వ్యవస్థ పనితీరు, గదుల భద్రత కమ్యూనిటీ పోలీసింగ్ తదితర కార్యక్రమాలపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితులు చేసిన ఫిర్యాదులపై మర్యాదగా వ్యవహరించి విచారణ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులతోపాటు ఇతర కేసులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించాలని సిబ్బందికి జిల్లా ఎస్పి డి.వి. శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డి.ఎస్.పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఎస్సై బి.లింగం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి రఘునందన్‌రావును పరామర్శించిన బిజెపి జిల్లానాయకురాలు కవితారెడ్డి



ఎంపి రఘునందన్‌రావును పరామర్శిస్తున్న బిజెపి జిల్లా నాయకురాలు కవితారెడ్డి

**నర్సాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
మెదక్ ఎంపి రఘునందన్‌రావు అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన బిజెపిపార్టీ జిల్లా మహిళానాయకురాలు కవితా రెడ్డి హైదరాబాదులోని రఘునందన్‌రావు చికిత్స పొందుతున్న హాస్పిటల్ కి వెళ్లి రఘునందన్‌రావును పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కవితారెడ్డి అడిగితెలుసుకున్నారు. ఎంపి రఘునందన్ రావు వెంటనేకోలుకోవాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో బిజెపిపార్టీ జిల్లా మహిళానాయకురాలు కవితారెడ్డితోపాటు నర్సాపూర్ మండల బిజెపి అధ్యక్షులు నీలి నాగేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 3, ప్రభాతవార్త:**
రైతులు స్వల్పకాలిక పంటలైనటువంటి వరి, మొక్కజొన్న, ప్రత్తి పంటల కంటే దీర్ఘకాలికంగా ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు ఆయిల్ పామ్ సాగు విధానంపై అవగాహన కల్పించడంతోపాటుగా ఈ పంట వల్ల రైతులకు కలిగే దీర్ఘకాలిక లాభాలు గూర్చి రైతుల కు వివరించి, ఈపంట సాగుకోసం దరఖాస్తులను గురువారం స్థానిక సహాయవ్యవసాయసంచాలకుల కార్యాలయంలో స్వీకరించడం జరిగింది. ప్రారంభ దశలో పంటల సాగులో అవగాహనతో పాటుగా అనేక ఇతర సబ్సిడీలు అందజేస్తూ రైతులకు ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులందరూ వినియోగించు కోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు వ్యవసాయశాఖ ఉద్యాన శాఖ అధికారులను సంప్రతించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయి కృష్ణ, సందీప్, ప్రవీణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందచేసిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జులై 3, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని డివిజన్‌వార్డు కార్యాలయంలో జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో గురువారం స్పోర్ట్స్ మెటీరియల్‌ను డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి ఆయా కాలనీలకు చెందిన యువకులకు, కాలనీ సొసైటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా సింధూ మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహద పడతాయన్నారు. భవిష్యత్తులో మరికొన్ని క్రీడా అభివృద్ధికి తన వంతు సహకారం అందచేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సొసైటీ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

## రైతులకు బీమాపథకం అమలుచేయాలి

**-రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్**

**-రైతు రక్షణ సమితి ముఖ్య సలహాదారు మిరియాల చంద్రశేఖర్**



విలేకరులతో మాట్లాడుతున్న యాదగౌడ్‌తోపాటు మిర్యాల చంద్రశేఖర్

**నర్సాపూర్ జూలై 3, ప్రభాతవార్త:**
రైతుల పంటల రక్షణ కోసం పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదాగౌడ్, రైతురక్షణసమితి ముఖ్యసలహాదారులు మిర్యాల చంద్రశేఖర్‌లు అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు ఆదేశాల మేరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, పంటల బీమా పథకాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే అమలుచేయాలని డిమాండ్‌చేశారు. రైతులు అకాలవర్షాలకు, అనావృష్టి, అతివృష్టికి పంటలు పాడైపోయి తీవ్రనష్టం కలిగి అప్పుల పాలవు తున్నారు అన్నారు. ప్రభుత్వం పంటల రక్షణకు పంటల బీమాను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రైతు రుణమాఫీ, రైతుభరోసా అందజేసి రైతులను ఆదుకుందని అన్నారు. అదేస్ఫూర్తితో రాష్ట్రప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన. పంటల బీమా యోజన కూడా అందజేస్తే రాష్ట్రప్రభుత్వం నిజంగా రైతుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల పంటల రక్షణకు భీమా పథకాన్ని అందించి ఆదుకోవాలని వారు అన్నారు.

## నాచగిరి ఆలయ డైరెక్టర్‌గా జగ్గయ్యగారి శేఖర్

**గజ్వేల్, జూలై 3, ప్రభాతవార్త:**
నాచగిరి ఆలయపాలకమండలి సభ్యునిగా గజ్వేల్ పట్టణానికిచెందిన వాసవిక్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్ ఎన్నికయ్యారు. ఈ సంద ర్భంగా ఆర్యవైశ్యసంఘం నాయకులు జగ్గయ్యగారి శేఖర్‌ను శాలువాతో ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు సిద్ధి బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, సంతోష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథస్వామి రథయాత్రలో ప్రముఖులు
**–పూజలు చేసిన కార్పొరేటర్, ఎమ్మెల్సీ**



జగన్నాథ్‌రథయాత్రలోపాల్గొన్న కార్పొరేటర్, ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షులు

**రామచంద్రాపురం, జూలై 3, ప్రభాతవార్త:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజికాలనీలో విద్యాభారతి హైస్కూల్ ప్రాంగణంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీజగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం అంగరంగవైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రథయాత్ర కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి పాల్గొని రథయాత్రకు శ్రీకారంచుట్టారు. రథయాత్రలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, విద్యాభారతి హైస్కూల్ చైర్మన్ దామోదర్ రెడ్డి, ఆయాసొసైటీల ప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఫార్మర్ ఐడికార్డుల కోసం వివరాలు ఇవ్వండి



మాట్లాడుతున్న మంజీర రైతు సమాఖ్య కోశాధికారి జైపాల్

**కొండాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
రైతులందరు ఫార్మర్ ఐడికార్డుల కోసం వివరాలు నమోదు చేసుకోవాలని మంజీరా రైతుసమాఖ్య రాష్ట్ర కోశాధికారి జైపాల్ కోరారు. గురువారం మండలపరిధిలోని అనంతసాగర్ పంచాయతీ కార్యాలయంలో రైతులకు విశిష్ట గుర్తింపుకార్డుల కోసం రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జైపాల్ పాల్గొని మాట్లాడారు. ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల నెంబర్‌తో విశిష్ట గుర్తింపుకార్డును రైతులు అందరు చేయించుకోవాలని అన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను, ప్రభుత్వస్కీంలు రైతులకు అందించడానికి ముఖ్యంగా కార్డులు పనిచేస్తాయన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల వద్ద తమ వివరాలను నమోదుచేసుకొని ప్రభుత్వపథకాలను వినియోగించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మారెపల్లిసొసైటీ డైరెక్టర్ జాకీర్, పంచాయతీకార్యదర్శి ఇందిర, కాంగ్రెస్‌నాయకుడు అనిల్‌కుమార్, ఎఇఓ రవి, రైతులు పాల్గొన్నారు.

## రైతులు ఈఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



బాదల్‌గావ్‌లో ఈఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఎఈఓ ప్రవీణ్‌కుమార్

**మనూర్, జూలై 3, ప్రభాతవార్త:**
వ్యవసాయ భూమిగల రైతులు ఈఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను విధిగా చేసుకోవాలని వ్యవసాయ విస్తీరణ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలపరిధిలోని ఆదల్‌గావ్‌లో రైతుల ఈఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎఈఓ ప్రవీణ్‌కుమార్ చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందుకునేందుకు రైతులు విధిగా ఈఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్‌తో ఈఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఓటిపి రానివారు (సెల్‌ఫోన్ లేనివారు) ఫోటోదిగాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఈఓ ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచించారు.

## అభివృద్ధి పనులకు సహకరించండి
**–మేనేజింగ్ డైరెక్టర్‌కు కార్పొరేటర్ వినతి**



అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 3, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో గురువారం రామచంద్రాపురం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని డివిజన్ అభివృద్ధికి సహకారం అందించాలని వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్‌లో డ్రైనేజీల సమస్యల గురించి వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. ఇటీవల డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు.

## అభివృద్ధి పనుల కోసం రూ.2కోట్ల66లక్షలు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ

**సదాశివపేట, జూలై 3, ప్రభాతవార్త:**
వ్యవసాయ మార్కెట్ కమిటీ సదాశివపేట సాధారణ సమావేశం గురువారం జరిగింది. మార్కెట్ కమిటీ అభివృద్ధి పనుల కోసం 2కోట్ల 66లక్షలు ఆమోదం కొరకు ఈసమావేశంలో నిర్ణయించారు. మార్కెటింగ్ అధికారి ఎండి రియాజ్ ఆధ్వర్యంలో హమాలి వాళ్లకు లైసెన్సులు అందజేశారు. ఈకార్యక్రమంలో చైర్మన్ సదకుల కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, డైరెక్టర్లు పట్లోళ్ల శివకుమార్, బి.శైలేందర్‌రెడ్డి, ఎం.మాణిక్ రెడ్డి, సయ్యద్ యూసుఫ్, నరేందర్‌గౌడ, వి.కళావతి, సోమ్లా, కొమ్మ రమేష్, కొత్త లక్ష్మణ్, జిల్లా మార్కెటింగ్ అధికారితోపాటు సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టాలి
**–మరమ్మతులు చేయకుంటే రాజీవ్‌రహదారిని దిగ్బంధిస్తాం**
**–మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జులై 3, ప్రభాతవార్త:**
కాళేశ్వరంలో కుంగిన పిల్లర్లను వెంటనేమరమ్మతు చేయించాలని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని అని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రంలో సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అంతపెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో రెండుపిల్లర్లు కుంగితే వందకోట్లు పెట్టి మరమ్మతులు చేయించనోళ్లు మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం, కాళేశ్వరం ప్రాజెక్టులనిర్మాణం కేవలం మూడు సంవత్సరాలలోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పూర్తి చేశారన్నారు. గతంలో ఏ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నా 20 నుండి 30 సంవత్సరాలు పట్టేదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతకట్టడంతో మూడు సంవత్సరాలలో పూర్తి చేశారన్నారు. కాళేశ్వరంలో కుంగిన పిల్లర్లను వెంటనే మరమ్మతుచేయకుంటే 10నుండి 15రోజుల్లో గజ్వేల్ నియోజకవర్గ రైతులతో రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం మరమ్మతులు చేసేవరకు ఊరుకునేది లేదని, ఎన్ని కేసులు అయినా, లాఠీచార్జ్ అయినా ప్రభుత్వాన్ని విడిచిపెట్టేదిలేదని అన్నారు. కుంగిన రెండుపిల్లర్లను మరమ్మతుచేసి కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, స్థానిక మాజీ కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, బొగ్గుల చందు, మర్కంటి కనకయ్య, అత్తెల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఊడెం కృష్ణారెడ్డి, యువజనవిభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, విరాసత్‌అలీ, కళ్యాణ్‌కార్ నర్సింగరావు, మెతుకు సాయిబాబా, మద్రి స్వామి, ఎల్ల వెంకటేశం, మల్లేశం, భూపాల్ రెడ్డి, ఉమర్, అహ్మద్, అజీజ్ పాల్గొన్నారు.

## కలుషిత నీటితో జర జాగ్రత్త
**–మిషన్ భగీరథ డిఈ సృజన్‌చక్రవర్తి**



వాటర్ సప్లై పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న డిఈ సృజన్‌చక్రవర్తి

**జహీరాబాద్, జులై 3, ప్రభాతవార్త:**
వర్షాకాలంలో కలుషితనీటితో అంటురోగాలు ప్రబలుతాయని అందుకు ప్రజలు కలుషితనీటిపై జర జాగ్రత్త వహించాలని మిషన్ భగీరథ డిఈ సృజన్‌చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని శేఖాపూర్, మల్చెల్మ, ఆనెగుంట గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, స్థానిక అధికారులతో కలిసి గ్రామాల్లో కలియతిరిగారు. ఆయా గ్రామాల్లో నీటి సరఫరా అవుతున్న పైప్‌లైన్‌లను, లీకేజీలను పరిశీలించారు. ఈసందర్భంగా డిఈ సృజన్‌చక్రవర్తి మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజి ఉంటే వర్షపునీరు, మురుగు నీరు సరఫరా అయ్యే అవకాశాలు ఉంటాయని, దీంతో కలుషితనీటి సేవనంతో వ్యాధులబారిన పడతామని గుర్తుచేశారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలు ఉంటే నీటిసరఫరాశాఖ అధికారులదృష్టికి తీసుకుపోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

## హుస్నాబాద్ నుండి అరుణాచలానికి ప్రత్యేకబస్సు

**హుస్నాబాద్ టౌన్, జూలై 3, ప్రభాతవార్త:**
జూలై 10వ తేదీన ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా హుస్నాబాద్ నుండి అరుణాచలం ఆలయ ప్రదక్షినలు చేయడానికి వెళ్లే భక్తుల సౌకర్యం కోసం హుస్నాబాద్ బస్‌డిపో నుండి ప్రత్యేక బస్‌ను నడిపిస్తున్నట్లు డిపో మేనేజరు వెంకన్న ఒకప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విడుదలచేసిన ప్రకటనలో అరుణాచలం వెళ్లే ఈ ప్రత్యేకబస్సు 8వ తేదీన హుస్నాబాద్ బస్టాండ్ నుండి బయలుదేరి జూన్ 10న అరుణాచలేశ్వరస్వామి గిరిప్రదక్షణ పూర్తి చేసుకుని 12వ తేదీన ఆలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శనం పూర్తిచేసుకుని తిరిగి హుస్నాబాద్‌కు ప్రయాణమౌతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. పూర్తి వివరాల కోసం 9959225930, 7382848449, 8790465049 నంబర్లకు సంప్రతించాలన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
**–కార్మికులతో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు**



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

**చౌటకూరు, జులై 3, ప్రభాతవార్త:**
ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను ప్రతి కార్మికుడు జయప్రదంచేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు సూచించారు. గురువారం మండలపరిధిలోని శివంపేటపరిధిలోని సిబిఎల్ పరిశ్రమ వద్ద ఏర్పాటుచేసినసమావేశంలో చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. కార్మికులుపోరాడి సాధించుకున్న 29కార్మికచట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌గా మార్చి 1శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు లాభం చేస్తోందని, ఈచట్టాలను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.మల్లేష్, జి.సాయిలు, యూనియన్‌వర్కింగ్‌ప్రెసిడెంట్ పి.బాగారెడ్డి, నాయకులుప్రసన్నరావు, నాగభూషణం, మల్లారెడ్డి, విష్ణు, యం.విఠల్, చంద్రయ్య, బి.విఠల్, లక్ష్మారెడ్డి, వెంకటేష్, మురళి, సురేష్ పాల్గొన్నారు.

## సమ్మేళన బహిరంగ సభను విజయవంతం చేయాలి
**–మాజీ మంత్రి ఆగమ చంద్రశేఖర్**



సమ్మేళనం డెలిగేట్‌బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, జులై 3, ప్రభాతవార్త:**
జులై 4వ తారీఖున హైద్రాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆగమ చంద్రశేఖర్ సూచించారు. ఈసందర్భంగా మాజీమంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ జై బాపు జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గురువారం పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ముఖ్యనాయకులతో మాజీ మంత్రి ప్రత్యేకంగా సమావేశం బహిరంగ సభ విజయవంతానికి మార్గ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారసింగ్, ఝురాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, రామలింగారెడ్డి, బీరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్షద్ అలీ, నాయకులు సామెల్, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాచన్న తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి ప్రమాదంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
**–సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్**

**సదాశివపేట, జూలై 3, ప్రభాతవార్త:**
పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సిగాచి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంవలన 42మంది కార్మికులు చనిపోయారని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు తక్షణమే కోటిరూపాయలు ఇవ్వాలని ఇంతటి ప్రమాదానికి కారణమైన కంపెనీ యజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పాషా మైలారం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సిగాచి కంపెనీ నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిపిస్తుంది అన్నారు. ఇంతటి ఘోరమైన ప్రమాదం జరిగిందంటే ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమ యజమాన్యంపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్‌చేశారు.

## ప్రణాళికతో వ్యవసాయం చేస్తే రైతులకు ఆర్థికంగా లబ్ది
**–జిల్లా వ్యవసాయాధికారి విన్సన్ వినయ్**

**చిన్నశంకరంపేట, జూలై 3, ప్రభాతవార్త:**
ప్రణాళికతో వ్యసాయంచేస్తే రైతులు ఆర్థికంగా లబ్దిపొందవచ్చని, పంట మార్పిడి తప్పనిసరి చేస్తేనే వ్యవసాయంలో అధిక లాభం పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విన్సన్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధి గవ్వలపల్లిలోని ఎరువుల దుకాణాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మోతాదుకుమించి ఎరువులను వాడకూడదన్నారు. రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డునుతీసుకొచ్చి ఎరువులను తీసుకోవాలని, తీసుకున్న ఎరువులకు రశీదులను తీసుకోవాలన్నారు. అధికధరలకు ఎరువులువిక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణ నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవిణ్, సాంకేతిక అధికారి వందనలు ఉన్నారు.

## 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సిద్దిపేట రూరల్, జూలై 3, ప్రభాతవార్త:**
ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 7న జిల్లాలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీలలోని ప్రతివార్డులో జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకరించిన కులపెద్దలను సత్కారించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు యాదగిరి, లత, పరశురామ్, రాజు, రమేష్, ప్రసాద్, లక్ష్మణ్, శ్రీహరి, మల్లేశం, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
**-కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, జులై 3, ప్రభాతవార్త:**
పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3,4వ వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంతో లబ్దిదారుల కళ్లలో సంతోషం కనబడుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపేరుతో పేద, బడుగు, బలహీన వర్గాలకు డబ్బులు కేటాయించారని, అదేతీరులో నేడు ఇందిరమ్మ పథకంతో ఇల్లు నిర్మాణం కొరకు రూ.5 లక్షలను ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంల పేరుతో పది సంవత్సరాలు కాలయాపన చేసి ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం కేటాయించిన పాపాన పోలేదని, నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లును కేటాయిస్తామన్నారు. అనంతరం ప్రజ్ఞాపూర్‌లోని మాలపోచమ్మ ఆలయం ఆవరణలో సిసి రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి.షరీఫ్, గుండు లక్ష్మణ్, కొల్లూరు సత్యం, పెర్క నాగరాజు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు శివులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటస్వామి, బెజుగామ శివారెడ్డి, జంగం రమేష్‌గౌడ్, పొద్దుటూరి వేణు, యూనుస్‌ఖాన్, భాస్కర్, గాడిపల్లి శ్రీనివాస్, రఫియొద్దీన్, సుఖేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే నిరుపేదల రాజ్యం
**–ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు**



భూమిపూజ చేస్తున్న ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు

**కొండాపూర్, జూలై 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తమ్మలిబాయ్ తాండలో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆత్మకమిటీ చైర్మన్ వై.ప్రభు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి కల నిజమయ్యేలా ఇందిరమ్మగృహాలను నిర్మించి ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో నిరుపేదలైన వారికి ఇందిరమ్మ పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని దృఢసంకల్పంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఆయాదశలలో కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హరిదాస్పూర్ మాజీ సర్పంచ్ నర్సింహులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు, శంకర్‌నాయక్, నాగేష్, రవి, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం బాధ్యులు

**మనూర్, జులై 3, ప్రభాతవార్త:**
బాలికల, మహిళల రక్షణ, భద్రతే లక్ష్యంగా షీ టీం పనిచేస్తోందని నారాయణఖేడ్ డివిజన్‌షీ టీం ఇంచార్జి ఎఎస్ఐ తులసిరాం, హెడ్ కానిస్టేబుల్ చాంగుబాయిలు అన్నారు. గురువారం మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీంపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈసందర్భంగా తులసిరాం, చాంగుబాయిలు మాట్లాడుతూ విద్యార్థినులపై వేధింపులు, మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించే పోకిరీలను అరెస్టుచేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పోలీసుఠాణాకు పిలిపించి ఈవ్‌టీజర్లకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. రెండవమారు వేధింపులకు, ఈవ్‌టీజింగ్‌లు చేస్తూ పట్టుబడితే నిర్భయకేసును నమోదుచేస్తామని హెచ్చరించారు. అపరిచితులు ఫోన్‌లద్వారా వేధించినా హెల్ప్‌లైన్‌నంబర్ 1098కు కాల్ చేయాలన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ విద్యార్థినులు, మహిళలు అత్యవసరం అనుకుంటే నారాయణఖేడ్ డివిజన్ షీ టీం ఇంచార్జి, ఎఎస్ఐ తులసిరాం (9492651635), హెడ్‌కానిస్టేబుల్ చాంగుబాయి (9121610750)లో సంప్రతించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్‌కుమార్, ఉపాధ్యాయులు సిహెచ్ నరసప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

## బద్రీనాథ్‌కు బైక్‌పై వెళ్ళిన గణేష్‌కు సన్మానం



శ్రీరాం గణేష్‌ను సన్మానిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, జులై 3, ప్రభాతవార్త:**
ప్రజ్ఞాపూర్‌కు చెందిన శ్రీరాం గణేష్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి శాలువాతో ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ శ్రీరాం గణేష్ ప్రజ్ఞాపూర్ నుండి తన బైక్‌పై కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను దర్శనం చేసుకొని రావడం అభినందనీయమన్నారు. 21 రోజుల పాటు సుమారు 8వేల కిలోమీటర్ల ప్రయాణం చేయడం సాహసోపేత నిర్ణయం అన్నారు. శ్రీరాం గణేష్‌కు మంచి భవిష్యత్తు ఉండాలని దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి.షరీఫ్, గుండు లక్ష్మణ్, కొల్లూరు సత్యం, పెర్క నాగరాజు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు శివులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటస్వామి, బెజుగామ శివారెడ్డి, జంగం రమేష్‌గౌడ్, పొద్దుటూరి వేణు, యూనుస్‌ఖాన్, భాస్కర్, గాడిపల్లి శ్రీనివాస్, రఫియొద్దీన్, సుఖేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎఎంసి వైస్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

**గజ్వేల్, జులై 3, ప్రభాతవార్త:**
మహబూబ్‌నగర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌ను విధినిర్వహణలో ఉండగా అదే మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ పి.విజయ్ కుమార్ ప్రత్యక్షంగా దాడికి పాల్పడినందుకు తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిఎన్‌జిఓ ఎఎంసి ఎంప్లాయీస్ కేంద్రసంఘంఅధ్యక్షుడు సిహెచ్.నర్సింహారెడ్డి, కార్యదర్శి ఎండి.ఫసియొద్దీన్‌ల ఆదేశాలమేరకు గురువారం గజ్వేల్ పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా మార్కెట్‌కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీం మాట్లాడుతూ ఉద్యోగులపై దాడులు చేయడం సరైందికాదన్నారు. దాడిచేసిన వైస్ చైర్మన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, వారిని పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## కల్వర్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు
**–తృటిలో తప్పిన ప్రమాదం**



రహదారిపై కల్వర్టును ఢీకొన్నకారు

**అల్లాదుర్గం, జూలై3, ప్రభాతవార్త:**
జాతీయ రహదారిపై అతివేగంగా దూసుకుపోతున్న కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న సంఘటనలో కారు నుజ్జునుజ్జవగా కారులోని ఇద్దరు అదృష్టవశాత్తూ ప్రమాదంనుంచి తప్పుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 161వ జాతీయ రహదారిపై నారాయణఖేడ్ సబ్‌రిజిస్ట్రార్‌లో విధులునిర్వహిస్తున్న నిజాముద్దీన్ విధులు ముగించుకుని కారులో సంగారెడ్డివైపు వెళుతుండగా అల్లాదుర్గం పోలీసుఠాణా పరిధి లోని ముస్తాపూర్–గడిపెద్దాపూర్ గ్రామల మధ్యన కారు అదుపుతప్పి కల్వర్టును బలంగా ఢీకొనడంతో కారుపూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న మహమ్మద్ నిజాముద్దీన్ ప్రమాదంనుంచి తృటిలో తప్పుకున్నాడన్నారు. కారులోని మరోవ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడని గ్రామస్థులు పేర్కొన్నారు.

## వివాహితతో పంచాయతీ కార్యదర్శి సహజీవనం
**–రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని దేహశుద్ధిచేసిన భార్య**
**–పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**చేర్యాల, జూలై 3, ప్రభాతవార్త:**
భార్య ఉండగా మరో వివాహితతో అక్రమ సంబంధం ఏర్పర్చుకుని సహజీవనంచేస్తున్న ఓపంచాయతీకార్యదర్శిని భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించిన సంఘటన చేర్యాలలో చోటుచేసుకుంది. గురువారం సిద్దిపేట జిల్లాలోని రూరల్ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ చేర్యాల పట్టణంలో గత కొంతకాలంగా మరో వివాహితతో సహజీవనం చేస్తున్నాడని భార్య, భర్తపై బంధువులతో కలిసి దాడికిచేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.